రాకపోకలకు ఒకటే మార్గం

- దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల ఇక్కట్లు
- మూసివేసిన మార్గం తెరవాలని డిమాండ్


మూసివేసిన ప్రవేశ మార్గం



నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం మార్గం వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల తాకిడి రెట్టింపు అవుతోంది. రోజు రోజుకూ ఈ స్టేషన్ నుంచి ప్రయాణం చేసే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మరోవైపు ఎన్ఏడీ కొత్తరోడ్డుకు ఇటు వైపు ఉన్న వారంతా దువ్వాడ రైల్వే స్టేషన్‌లోనే దిగి వారి గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. విశాఖ రైల్వేస్టేషన్‌కు వెళ్లి మళ్లీ రోడ్డు మార్గంలో రావడానికి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో ప్రయాణికులు విశాఖకు ఆరంభంలో ఉన్న దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అయితే నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు ముఖద్వారం (ప్రవేశం, నిష్క్రమణ మార్గం) ఒక్కటే ఉండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

టికెట్ కౌంటర్లు అక్కడే

వాటికి తోడు జనరల్ టికెట్ కౌంటర్, ఏటీవీఎంలు కూడా అక్కడే ఉండడంతో ప్రయాణికులు కిక్కిరిసి ఉంటున్నారు. రైలు దిగి బయటకు వెళ్లడానికి ..బయట నుంచి లోపలికి ప్రవేశించడానికి ఆరడుగుల వెడల్పు మార్గం ఒక్కటే ఉండడంతో ప్రయాణికులు ప్లాట్‌ఫారంపై నిలిచిపోతున్నారు. గతంలో రెండు మార్గాలు ఉండగా ఆరేళ్ల కిందట ఒక మార్గాన్ని మూసివేశారు. దీంతో ఒక మార్గం ద్వారానే రాకపోకలు సాగించాల్సి వస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రైల్వేస్టేషన్ ఆధునికీకరణలో భాగంగా మూసివేసిన మార్గాన్ని తెరిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇరుకు మార్గంతో ఇబ్బంది



ప్రయాణికుల ప్రవేశ, నిష్క్రమణ మార్గం ఒక్కటే కావడంతో రైలు దిగిన ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. మహిళలు, లగేజీలు, పిల్లలతో లోపలకు.. బయటకు వెళ్లడానికి ఆపసోపాలు పడుతున్నారు. స్టేషన్ పునరాభివృద్ధిలో వీటిని పరిగణలోకి తీసుకోవాలి. నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు టికెట్ బుకింగ్ కౌంటర్ ప్రవేశ మార్గంలోనే ఉండడంతో ఈ పరిస్థితి ఉంది. అధికారులు గమనించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– కోమటి రమాదేవి, నిర్వాసితకాలనీ

మూసిన మార్గం తెరవాలి



గతంలో అందుబాటులో ఉన్న మార్గాన్ని మూసివేశారు. దీని వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ ద్వారం కాకుండా మరోమార్గం ప్రతీ రైల్వేస్టేషన్‌లో అందుబాటులో ఉంటుంది. అలాంటప్పుడు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రెండో మార్గం ఉండడం వల్ల ఎవరికి నష్టం. అధికారులు పునరాలోచించాలి.

– దాసరి త్రినాథ్, అగనంపూడి కాలనీ

మంచినీటి ప్రాజెక్టు నిర్వహణ గాలికి..

- జీవీఎంసీ కమిషనర్ పర్యటనతో కదలిక ..

కూర్మన్నపాలెం: ప్రజలకు తాగునీరు అందించే సిద్ధార్థనగర్ మంచినీటి శుద్ధి ప్రాజెక్టు నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉండడంతో ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రాజెక్టుకు సంబంధించి ఏ పని అయినా తాత్కాలిక సిబ్బందే చేస్తారని.. సంబంధిత అధికారి అంటీముట్టనట్టు వ్యవహరిస్తారని ప్రచారం సాగుతోంది. అందువల్లే ఇటీవల జీవీఎంసీ కమిషనర్ ఆ అధికారితో పాటు మరికొంతమందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారని సిబ్బందే చెవులు కొరుక్కుంటున్నారు.

ఇదీ పరిస్థితి

మంచినీటిని శుద్ధి చేసినప్పుడు పేరుకుపోయిన బురద, మట్టిని ప్రతి మూడు నెలలకోసారి శుభ్రం చేయాల్సి ఉంది. కమిషనర్ ఆదేశాలతో ఇటీవల అధికారులు దగ్గరుండి ట్యాంక్‌లో పేరుకు పోయిన పూడిక తీయించారు. అయితే అప్పటికే దాదాపు ఏడు అడుగుల ఎత్తులో మట్టి ఉండడం చూసి అధికారులే విస్తుపోయారు. అంటే మూడు నెలలకే అంతలా పూడిక చేరిపోయిందంటే ఎవరూ నమ్మలేక పోతున్నారు. ఏడాదిన్నర కిందట మట్టి తీశారని కొందరు చెబుతున్నారు.


ట్యాంకులో పేరుకు పోయిన మట్టి (ఫైల్)

నిధుల సంగతేంటి?

మూడు నెలలకోసారి శుభ్రం చేయాల్సిన ట్యాంకులో ఏడాదిన్నర కిందట మట్టి తీస్తే అందుకోసం కేటాయించిన నిధులు ఎటు వెళ్లాయన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. మూడునెలలకోసారి మట్టి తీస్తే అంతలా పేరుకుపోదని వారే చెబుతున్నారు. నిబంధనల ప్రకారం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరుసార్లు పూడిక తీయాల్సి ఉంది. అన్నిసార్లు తీసిన దాఖాలాలు లేవు. అధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు అయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు సమగ్రంగా విచారిస్తే బాగోతం బయటపడుతుందని చెబుతున్నారు.

క్లుప్తంగా

స్టీల్ సిటీ డిపో కొనసాగించాలి


రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం: ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోను ప్రస్తుతం ఉన్న చోటే కొనసాగించాలని స్టీల్ సిటీ డిపో జాయింట్ సెక్రటరీ కె.వి.ఆర్.కె. గుప్తా డిమాండ్ చేశారు. స్టీల్ సిటీ డిపో తరలింపు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 45వ రోజుకు చేరుకున్నాయి. ఆయన మాట్లాడుతూ డిపో లీజు గడువు ముగియడంతో ఖాళీ చేయాలని లేనిపక్షంలో రూ. 130 కోట్లు డిపాజిట్‌తో పాటు అద్దె చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆర్టీసీకి నోటీసు జారీ చేసిందన్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన డిపోను తరలిస్తే ప్రజలకు అసౌకర్యం కలుగుతుందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని అక్కడే డిపో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలో కార్మికులు ఎన్.ఎస్. వాసు, జి. సాయిరామ్, సీహెచ్.డి.పి రావు, ఎల్.ఎన్.ఎస్. మూర్తి కూర్చున్నారు. పలువురు కార్మికులు వారికి మద్దతు తెలిపారు.

120 మందికి వైద్య పరీక్షలు


ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

అగనంపూడి: స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ఫంక్షన్ హాల్లో ఎస్ఎన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 120 మంది పెన్షనర్లకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.బోసుబాబు, బి.భాస్కరరాజ్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత వైద్య సేవలతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్యులు డాక్టర్ కోనేరు ఫణికుమార్, నీతు, జి.సుజిత్ సేవలు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఐ.రామునాయుడు, రఫీ, కాళిదాస్, పోలిరెడ్డి, అప్పడు, నూకరాజు పాల్గొన్నారు.

కార్మికనేతకు సత్కారం


ముత్యాలును సత్కరిస్తున్న గ్రామాభివృద్ధి సంఘు నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు కార్మిక సంఘ నాయకుడిగా పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సేవలు అందిస్తున్న జెర్రిపోతుల ముత్యాలును ఆదివారం నడుపూరు గ్రామ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సంఘ నాయకులు సియ్యాద్రి సత్యారావు, అప్పలరాజు, పెంటారావు, అప్పారావు, అప్పలనాయుడు, పెంటయ్య నాయుడు, సోమునాయుడు పాల్గొన్నారు.

మేహాద్రిలో ఈత ప్రమాదకరం


మేహాద్రి వద్ద సందర్శకులను హెచ్చరిస్తున్న పోలీసులు

పెందుర్తి: నిండు కుండను తలపిస్తున్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో ఈత ప్రమాదకమరని సీఐ కేవీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మేహాద్రికి సందర్శకుల తాకిడి పెరిగిన నేపథ్యంలో సమాచారం అందుకున్న సీఐ సతీష్‌కుమార్ పోలీస్ సిబ్బందిని అక్కడకు పంపి కౌన్సిలింగ్ ఇచ్చారు. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాలను సిబ్బంది సందర్శకులకు వివరించారు. ఇక్కడ ఈత చేయరాదని, వారాంతంలో ఇక్కడకు వచ్చే వారంతా మేహాద్రి పరిసర ప్రాంతాల్లో ప్రకృతి అందాలను చూసి తరించాలి తప్ప ఈతకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం

గాజువాక: ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాన్ని గాజువాకలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో స్థానిక అమరావతి పార్కులో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం, కోలాటం విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతకుముందు ఆర్ఎస్ఎస్ సభ్యులు జగ్గు జంక్షన్‌నుంచి అమరావతి పార్కు వరకు కవాతు నిర్వహించారు. అనంతరం చిన్మయి మిషన్ రాష్ట్ర ప్రచారకుడు రఘువీరానంద స్వామి మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప సంస్థ ఆర్ఎస్ఎస్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి సుబ్రమణ్యం, డాక్టర్ శేషు ప్రసాద్, డాక్టర్ గొర్లె సత్యనారాయణ, జి.సత్యనారాయణ, బాటా శ్రీనివాస్, గూటూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవంలో పాల్గొన్న రఘువీరానంద స్వామి తదితరులు

- బీజేపీ కో ఆర్డినేటర్ దీనంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో శ్రామికనగర్‌లో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు నర్రా శేషుప్రసాద్, పాలిమేర శ్రీనివాసరావు, సంతోష్‌కుమార్‌రాజు, ఎం.సంతోష్, జగదీష్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో కొత్త కోర్సులకు దరఖాస్తులు

పెదగంట్యాడ: ప్రభుత్వ ఐటీఐలో కొత్తగా మూడు కోర్సులు ప్రారంభిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఎలక్ట్రానిక్ మెకానిక్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనర్ మెకానిక్, అటెండెంట్ ఆపరేటర్ (కెమికల్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటల్లోపు ఐటీఐ.ఏపీ.జీవో.ఇన్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి సర్టిఫికెట్లను పరిశీలన చేస్తామన్నారు. అలాగే పదో తరగతి ఫెయిల్ అయిన, 8వ తరగతి పాసైన వారి కోసం కార్పెంటర్, పెయింటర్, ప్లంబర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17న ఉదయం 10 గంటలకు ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

పారదర్శకత కోసమే స.హ.చట్టం

అగనంపూడి: పాలనలో పారదర్శకత కోసం తీసుకువచ్చిన సమాచార హక్కు చట్టాన్ని పాలకులే నిర్వీర్యం చేస్తున్నారని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు అన్నారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో ఆదివారం నిర్వహించిన సమాచార హక్కు చట్టం అమలు దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం, సంస్థల పనితీరును మెరుగుపర్చడం, జవాబుదారీతనం, పారదర్శకత కోసం ఈ చట్టం చేసినా అమలులో అలసత్వం ప్రదర్శించడంతో చట్టంపై ప్రజలకు చులకనభావం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. దరఖాస్తు చేసే విధానం, చట్టం ముఖ్య ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు కాసా పద్మరాజు, శరగడం రామారావు, గుడే సుశీలా గజేంద్రరావు, కిడిమి హనుమంతురావు తదితరులు మాట్లాడారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న రామఅప్పారావు

ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం కోశాధికారిగా పాలగుమ్మి


పాలగుమ్మి రాజారావు

పెదగంట్యాడ: రాష్ట్ర ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర శాఖ కోశాధికారిగా జిల్లాకు చెందిన పాలగుమ్మి రాజారావు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం పెదగంట్యాడ మండలం గంగవరం ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విజయవాడలో శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నట్లు రాజారావు ఆదివారం తెలిపారు. జిల్లాలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడిగా పదేళ్లుగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పదవి కోసం తనను ఎన్నుకోవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు మేలు కలిగేలా ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం పనిచేస్తుందని తెలిపారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

కబడ్డీ టోర్నీ విజేత విశాఖ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జేపీఎం కబడ్డీ స్పోర్ట్స్ యూత్ ఆధ్వర్యంలో జాలరిపల్లిపాలెంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో మొత్తం పది జిల్లాల నుంచి కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో విశాఖపట్నం జట్టు నిలవగా.. తూర్పు గోదావరి జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జేఎస్‌వీ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రైల్వే మేజిస్ట్రేట్ స్పెషల్ డ్రైవ్

- వెయ్యి కేసుల పరిష్కారం.. రూ.3 లక్షల జరిమానా

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రైల్వే మేజిస్ట్రేట్ కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో వెయ్యి కేసులు పరిష్కరించారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నమోదు చేసిన 1,400 కేసుల్లో ఈ వెయ్యి కేసులను పరిష్కరించి, రూ.3 లక్షల జరిమానా విధించారు. మహిళా, దివ్యాంగుల బోగీల్లో ప్రయాణించడం, అనవసరంగా అలారం లాగడం, స్టేషన్‌లో, బోగీల్లో ఆకతాయిగా వ్యవహరించడం, రైల్వే ఆవరణలో ఆక్రమణలు, నో-పార్కింగ్ జోన్‌లో వాహనాలు నిలపడం వంటి వివిధ ఉల్లంఘనలకు పాల్పడిన ప్రయాణికులు, వ్యక్తులపై ఈ కేసులు నమోదు చేశారు. ప్రత్యేక క్యాంపు ద్వారా ప్రయాణికులను అప్రమత్తం చేయడమే లక్ష్యమని దువ్వాడ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకటరమణ తెలిపారు. అనంతరం రైల్వే మేజిస్ట్రేట్ కార్తీక్‌ను దువ్వాడ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, రైల్వే సిబ్బంది సత్కరించారు.


రైల్వే మేజిస్ట్రేట్ కార్తీక్‌ను సత్కరిస్తున్న దువ్వాడ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ

వెంకటాద్రిపై ప్రత్యేక పూజలు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వెంకటాద్రిపై ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చనలు నిర్వహించారు. ముందుగా భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

క్రీడాకారులను ప్రోత్సహించాలి

కూర్మన్నపాలెం: క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని ప్రోత్సాహించాలని 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు అన్నారు. ఐదు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నీ ముగింపు సందర్భంగా ఆదివారం విజేతలకు ఆయన ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 86,87వ వార్డుల్లో అనేకమంది క్రీడాకారులు ఉన్నారన్నారు. వారిని మరింత ప్రోత్సహిస్తే ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తారని అభిప్రాయపడ్డారు. టోర్నీ విన్నర్‌గా గోవింద్ సీసీ టీం, రన్నర్‌గా కళింగవారియర్స్ జట్లు నిలిచాయి. కార్యక్రమంలో హేమంత్, ఈశ్వరరావు, గణేశ్, రమేష్‌తో క్రీడాకారులు పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న కోమటి శ్రీనివాస్

'అంకెల మామయ్య'..భలే శిక్షణ ఇచ్చాడు..

మద్దిలపాలెం: పిల్లలను మొబైల్ ఫోన్‌ల వ్యసనం నుంచి దూరం చేసి, వారిలో సృజనాత్మకతను, ఏకాగ్రతను పెంచే లక్ష్యంతో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శివాజీ పాలెంలో ఆదివారం ఒక ప్రత్యేకమైన వర్క్‌షాప్ నిర్వహించారు. 'మొబైల్ డీ-అడిక్షన్, ఫన్ మ్యాథ్స్, చిట్టి ప్రయోగాలు' అనే ఈ కార్యక్రమంలో ప్రముఖ మెజీషియన్, 'అంకెల మామయ్య' చంద్రయ్య శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా చంద్రయ్య సైన్స్ సూత్రాలను చిన్న చిన్న ప్రయోగాల ద్వారా చిన్నారులకు అర్థమయ్యే విధంగా వివరించారు. హిప్నోటిక్ స్ట్రా, ఎగిరే స్ట్రా, తిరుగుతున్న స్ట్రా, మ్యాచ్ బాక్స్ రైలు, విధేయుడైన అగ్గిపెట్టె, సింపుల్ యానిమేషన్, పేపర్ విజిల్, అరచేతిలో మ్యాజిక్ వంటి ఆసక్తికరమైన అంశాలతో పిల్లలు ప్రయోగాలు చేసి నేర్చుకున్నారు. మరోవైపు గణితంలో సరదా అంశాలైన తప్పిపోయిన అంకె, పుట్టినరోజు తర్కం, వయస్సు రహస్యం, స్పెల్లింగ్ లాజిక్ వంటివాటిని చెప్పించారు. ఈ కార్యకలాపాల ద్వారా పిల్లలు కేవలం సమయాన్ని గడపడమే కాకుండా, వాటి వెనుక ఉన్న సైన్స్ సూత్రాలు సులువుగా తెలుసుకుంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ తరహా వర్క్‌షాప్‌ల ద్వారా పిల్లల్లో శ్రద్ధ, మెరుగైన జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, విమర్శనాత్మక ఆలోచన పెరుగుతాయని చంద్రయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో కాయిన్ మ్యాజిక్ కాజా కూడా పాల్గొనగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో పాల్గొన్న చిన్నారులకు శిక్షణ ఇస్తున్న చంద్రయ్య

ఆసక్తికరంగా స్టోరీ టెల్లింగ్

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం పబ్లిక్ లైబ్రరీ, విద్యా భవన్స్ స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ పిల్లలను ఉత్సాహపర్చింది. కథాకారిణి ఎం.సీతా శ్రీనివాస్ తనదైన శైలిలో చమత్కారం, తెలివితో ప్రత్యేకత సాధించిన ఒక చిన్న ఉల్లాస భరితమైన 'టైలర్ బర్డ్' కథను ఎంతో ఆసక్తికరంగా వివరించారు. కథ వినడమే కాకుండా వర్క్‌షాప్‌లో పిల్లలు పాటలు పాడి, పక్షులు కట్టె వివిధ రకాల గూళ్లు పరిశీలించి కొత్త విషయాలు నేర్చుకున్నారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన


అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేంపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర పూజ చేశారు. దాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా నిత్య కల్యాణం


నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరహా లక్ష్మీ నృసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి అంతరాలయ దర్శనం, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదం అందజేశారు.

బంగారు గొలుసు అందజేత

గోపాలపట్నం: సింహాచలం దేవస్థానంలో మహిళ పోగొట్టుకున్న బంగారు గొలుసును గోపాలపట్నం నేర విభాగం పోలీసులు గంటల వ్యవధిలో అందించారు. క్రైం పోలీసులు తెలిపిన వివరాలు.. విజయనగరం జిల్లా బొబ్బిలి ప్రాంతానికి చెందిన సత్యవతి సింహాచలం శ్రీ వరాహ నృసింహ స్వామిని దర్శించుకుని ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆలయం నుంచి బయటకు వచ్చింది. ఆ సమయంలో చూసుకునే సరికి మెడలో గొలుసు కనిపించక పోవడంతో ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ మీసాల చంద్రమౌళి పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కానిస్టేబుల్ తేజేశ్వరరావు సీసీ ఫుటేజీలను పరిశీలించి పోగొట్టుకున్న బంగారు గొలుసును గుర్తించి బాధితురాలు సత్యవతికి అందించారు. పోలీసులు చూపిన చొరవకు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


బాధితురాలు సత్యవతికి గొలుసు అందిస్తున్న కానిస్టేబుల్ తేజేశ్వరరావు